ఆధార్ లేని విద్యార్థులకు
కస్పా స్కూలులో ప్రత్యేక కౌంటర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

5 సంవత్సరాల నుండి 17ఏళ్ల వయస్సు కలిగి ఆధార్ కార్డులు లేకుండా చదువుతున్న విద్యార్థులకు ఆధార్ కార్డులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశాల మేరకు కస్పా హైస్కూలులో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు డిఇఒ మాణిక్యం నాయుడు తెలిపారు. ఈనెల 23నుంచి 25వరకు రోజూ ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5వరకు ఈ కౌంటర్ పనిచేస్తుందని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఆధార్ లేని విద్యార్థులు ఆధార్‌కార్డులు చేయించుకోవాలని, ఆ విద్యార్థులకు ఈవిషయాన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తెలియజేయాలని తెలిపారు.

అచ్యుతానందన్ మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

సిపిఎం నాయకుల సంతాపం

అచ్యుతానందన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేరళ మాజీ ముఖ్యమంత్రి విఎస్ అచ్యుతానందన్ మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు అని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ అన్నారు. అచ్యుతానందన్ మృతి నేపథ్యంలో మంగళవారం స్థానిక ఎల్‌బిజి భవనంలో సిపిఎం ఆధ్వర్యంలో సంతాప సభ జరిగింది. ముందుగా అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ కేరళ ముఖ్యమంత్రిగా చేసిన అచ్యుతానందన్ మరణం వామపక్ష ఉద్యమానికి తీవ్రలోటు అన్నారు. 16ఏళ్ల వయసులో ఉద్యమాల్లోకి వచ్చారని, పేదల సాదక బాధలు గుర్తించిన వ్యక్తి అని అన్నారు. ఆయన పేద ప్రజలకు అందించిన సేవలు, ఉద్యమాలు స్ఫూర్తి దాయకమని అన్నారు. కేరళలో కార్మిక, ప్రజాతంత్ర ఉద్యమాన్ని నిర్మించిన తీరు స్ఫూర్తిదాయకమన్నారు. కేరళలో బిజెపి మతోన్మాద దాడులను ఎదుర్కొని సిపిఎం ముందుకు వెళ్తోందన్నారు. సిపిఎం నాయకులు ఎం. శ్రీనివాస మాట్లాడుతూ ఎల్‌ఐసి ఉద్యోగుల సంఘం నాయకుడిగా ఉండి మధ్యప్రదేశ్‌లో, నేడున్న ఛత్తీస్‌ఘడ్‌లో కార్మికవర్గంతో విఎస్‌కు మంచి అనుబంధం ఉందన్నారు. బాల్కో ఉద్యమంలో ఆయన చేసిన పోరాటం, ముందుండి నడిపిన విధానం స్ఫూర్తిదాయకం అన్నారు. వారి ఆశయాలు కోసం,కార్మికవర్గ రాజ్యం కోసం పీడిత ప్రజలు కోసం అచ్యుతానందన్ స్ఫూర్తితో పని చేయాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకర్రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.లక్ష్మి, నాయకులు కె.సురేష్, ఎ.జగన్మోహనరావు, పి.రమణమ్మ, బి.సుధారాణి సిహెచ్ వెంకటేష్, డి.రాము, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాలకు తీరని లోటు : ఐద్వా

అచ్యుతానందన్ మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అని ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ అన్నారు. స్థానిక ఎల్‌బిజి నగర్ లో సంతాప కార్యక్రమాన్ని ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. కేరళ రాష్ట్రంలో సిపిఎం అభివృద్ధిలో ప్రజా పోరాటాల్లో ఆయన కృషి ఎనలేనిదన్నారు. ఆయన అందించిన బాటలో సమ సమాజం కోసం పని చేయాలని కోరారు. ఐద్వా నాయకులు జి.పుణ్యవతి, కె.కుమారి మహిళలు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : స్థానిక విద్యుత్ జిల్లా స్టోర్స్ వద్ద విద్యుత్ హమాలీల సంఘం ఆధ్వర్యంలో అచ్యుతానందన్ మృతికి నివాళులర్పించారు. సిఐ టియు నాయకులు కిల్లంపల్లి రామారావు మాట్లాడుతూ వామపక్ష ఉద్యమం అభివృద్ధికి అచ్యుతానందన్ కృషి చేశారన్నారు. హమాలీ సంఘం నాయకులు పతివాడ లక్ష్మణరావు, కెల్ల గోవిందరావు, పతివాడ పెద రాంబాబు, చిన రాంబాబు, కాశీ, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : అచ్యుతానందన్ మృతి ప్రజా, కార్మిక, రైతు ఉద్యమాలకు తీరని లోటని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు అన్నారు. సిపిఎం కార్యాలయంలో అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అచ్యుతానందన్ విద్యార్థి దశ నుంచే వ్యవసాయ కార్మికుల సమస్యలపైన, పేదలకు భూమి ఇవ్వాలని భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. ఆయన ఆశయ సాధనకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ ఎస్.గోపాలం, నాయకులు ప్రసాద్, లక్ష్మి, యుగంధర్, ఎస్.ఎఫ్.ఐ నాయకులు శివ, సభ్యులు పాల్గొన్నారు.

డెంకాడ : అచ్యుతానందన్ మృతికి మండల కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యంలో సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టివి రమణ మాట్లాడుతూ ప్రజా ఉద్యమాల్లో ప్రజలకు చైతన్య నింపి ముందుకు నడిపించారన్నారు. కేరళ రాష్ట్రంలో సిపిఎం అభివృద్ధిలో ప్రజా పోరాటాల్లో ఆయన కృషి ఎనలేనిదని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బచ్చల సూర్యనారాయణ, ఆశావర్కర్ల అక్కి వరం యాచరీస్, సిబ్బంది పాల్గొన్నారు.

బొబ్బిలిలో నివాళులర్పిస్తున్న సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు

హామీ కాదు..బతుకు తెరువు చూపాలి

రైతుబజారు రైతుల పోరాటం
రాజులు, అధికారుల వ్యవహారంపై ప్రజల నుంచి వ్యతిరేకత

అధికారులు ఖాళీ చేయించిన రైతు బజారు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

26ఏళ్లుగా రైతు బజారునే నమ్ముకుని బతుకుతున్న రైతులు తమ బతుకు తెరువుకోసం అలుపెరుగని పోరాటం సాగిస్తున్నారు. విజయనగరం పాత ఆసుపత్రి స్థలం (సర్వే నెంబరు 166/1) లో ఉన్న రైతుబజారును ఖాళీ చేసి రాజుల కుటుంబానికి అప్పగించే ప్రక్రియ జిల్లా అధికార యంత్రాంగం చేపట్టింది. ఆ నాటి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన రైతు బజార్‌ను నేడు స్వీయ ప్రయోజనాల కోసం 50 మంది రైతులను రోడ్డు మీదకు నెట్టేందుకు జిల్లా అధికార యంత్రాంగం పూనుకుంది. గతంలో ప్రభుత్వ భూమి అని చెప్పి దానిని నేడు ప్రైవేటు భూమిగా జిల్లా అధికార యంత్రాంగం రికార్డుల్లో మార్పులు చేసి భూమిని కొల్లగొట్టేందుకు కావల్సిన ఏర్పాట్లు చేపట్టింది. దీంతో ఇటీవల కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు ఈనెల 15న కలెక్టర్‌ను కలిసిన తర్వాత అధికార యంత్రాంగం రైతు బజార్‌ను ఖాళీ చేయించేందుకు చర్యలు చేపట్టారు. దీంతో ఆ రైతులంతా పేదలకు అండగా ఉండే పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తమ పొట్ట కొట్టొద్దని, బతుకు తెరువు కల్పించాలని కోరుతూ గత ఆరు రోజుల నుంచి రాత్రి పగలు రైతు బజార్ లోనే నివాసం ఏర్పాటు చేసుకొని పోరాడుతున్నారు. సిపిఎం, ప్రజా సంఘాలు, రైతుల పోరాటానికి అండగా నిలబడటంతో ఒక్కసారిగా రైతు బజార్ విషయం చర్చ నీయాంశంగా మారింది.

వేల ఎకరాలు భూమి ఉన్న రాజులు ఈ భూమిని చేజిక్కించుకునేందుకు చూడటం వెనుక ప్రజల నుంచి అనేక విమర్శలు వస్తున్నాయి. ఆరు రోజుల పోరాట ఫలితంగా రాజులపై వస్తున్న వ్యతిరేకత దృష్టిలో పెట్టుకొని రాయబారాలు నడుపుతున్నారు. దీంతో రైతులకు నష్టం జరగకుండా న్యాయం చేస్తామని, త్వరలో షెడ్ లు వేసి ప్రత్యామ్నాయ స్థలం లో ఏర్పాటు చేసి ఇస్తామని అధికార యంత్రాంగం నుంచి హామీలు ఇచ్చి ఆందోళన విరమించే ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రత్యామ్నాయ స్థలంలో.షెడ్ లు కట్టి ఇస్తామని చెబుతున్నప్పటికీ రైతు మాత్రం అందుకు సముఖంగా లేరు. ఇక్కడున్న 1.48 ఎకరాల్లో కనీసం 10 సెంట్లు రైతు బజార్ నిర్వహణకు విడిచిపెట్టి న్యాయం చేయాలని వారు కోరుతున్నారు. మరి రైతులకు న్యాయం జరిగే విధంగా అధికార యంత్రాంగం, రాజ కుటుంబం చూస్తుందా? లేదో వేచి చూడాలి

మాకు ఇక్కడే బతుకు తెరువు కల్పించండి

మేము ఇదే ప్రాంతంలో 26 ఏళ్లుగా కూరగాయలు వ్యాపారం చేసుకుని కుటుంబాలను ఈడ్చుకొస్తున్నాం. మేము భూమి ఇవ్వబోమని చెప్పడం లేదు. మాకు ఇదే ప్రాంతంలో కొంత భూమి ఇచ్చి బతుకు తెరువు కల్పించాలని కోరుతున్నాం. ఇక్కడే వ్యాపారం కోసం అవకాశం కల్పించే విధంగా ఎమ్మెల్యే ఆలోచించాలి.

నీలాతి కృష్ణమ్మ, రైతు

రోడ్డు పాలు చేయొద్దు

మమ్మల్ని రోడ్డు పాల్జేసి మా పొట్ట కొట్టేందుకు మీకు అధికారం ఇచ్చామా? మేము ప్రతి నెలా రూ.3800 అద్దె 26 ఏళ్లుగా చెల్లిస్తే మాకు ఇచ్చిన గౌరవం ఇదేనా? అధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలి

టి.కనకం, రైతు

ఇక్కడే రైతు బజారు కొనసాగించాలి

ఈ స్థలంలో 1922 నుండి 1995 వరకు ప్రభుత్వ ఆసుపత్రి నడిచింది. 1995 నుండి 97 వరకు టిబి హాస్పటల్ ఉండేది. 1999 నుండి రైతు బజారు ఉంది. 103 ఏళ్లుగా ప్రభుత్వ భూమి ఇపుడు ఎలా ప్రయివేటుది అయ్యిందో అధికారులు చెప్పాలి. 200 కోట్ల విలువైన భూమిని అశోక్ గజపతి రాజు కొట్టేయాలని చూస్తున్నారు. ఇది ప్రజలకు దక్కే వరకు పోరాడుతాం.

రెడ్డి శంకరరావు
పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి

సిపిఐ(ఎంఎల్)కు బెహరా శంకరరావు రాజీనామా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సిపిఐ (ఎంఎల్) పార్టీకి, కార్మిక సంఘాలకు రాజీనామా చేస్తున్నట్లు ఆ పార్టీ నాయకుడు, ఎఐ ఎఫ్‌టియు నాయకుడు బెహరా శంకరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పార్టీలో ఏర్పడిన అంతర్గత పరిణామాలు విషయంలో రాష్ట్ర కమిటీకి తెలియజేసినా సరిచేయలేదని పేర్కొన్నారు 18ఏళ్లుగా పార్టీలో పని చేసినప్పటికీ అంతర్గత పరిణామాల నేపథ్యంలో రాజీనామాలు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆయనతో పాటు యువజన విభాగం అధ్యక్షుడు అప్పలరాజు, గిరి ప్రసాద్ తో పాటు మరో 16మంది రాజీనామా చేసినట్లు తెలిపారు.

ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్‌గా శ్రీనివాస చౌదరి

ప్రజాశక్తి- కంటోన్మెంట్

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్‌గా నియమితులైన వై.శ్రీనివాస చౌదరి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కృష్ణా జిల్లాలో అసిస్టెంట్ కమిషనర్‌గా పని చేసిన ఆయన ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్ చౌదరిని జిల్లాలోని పలువురు ఎక్సైజ్‌శాఖ అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

ఆక్రమణలపై నగరపాలక సంస్థ కొరడా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో ఆక్రమణ తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది. నగర ప్రణాళిక సిబ్బంది వివిధ ప్రాంతాలలో అక్రమ నిర్మాణాలను, ఆక్రమిత కట్టడాలను తొలగించారు. కెఎల్ పురం, సుందరయ్య కాలనీ, బౌడార రోడ్డు,రింగ్ రోడ్డు ప్రాంతంలో రహదారిని ఆక్రమించి నిర్వహిస్తున్న చేపల అమ్మకాలను తరలించాశారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ రహదారులను, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి ఎటువంటి నిర్మాణాలు గానీ కట్టడాలను గాని చేపట్టరాదని అన్నారు. అటువంటివి గుర్తించిన వెంటనే తొలగిస్తామని స్పష్టం చేశారు.

సీతంలో 'సైకాలజీ ఆఫ్ ఎడిక్షన్' పై అవగాహన

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

సీతం ఇంజినీరింగ్ కళాశాలలో సైకాలజీ ఆఫ్ ఎడిక్షన్ అనే అంశంపై విద్యార్థుల కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మానసిక నిపుణుడు శ్రీ మూర్తి హాజరై వ్యసనాల మానసిక మూలాలను వివరించారు. వ్యసనానికి శారీరక డిమాండ్ కంటే ముందు మానసిక ఉత్పత్తి ఎక్కువ అని, ఒత్తిడి, ఒంటరితనం, పరిష్కారాల లేమి వంటి కారణాలు మానవ మనస్సులో వ్యసనాన్ని నెమ్మదిగా పెంచుతాయని తెలిపారు. కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ మనస్సు స్థిరంగా ఉంటే, అలవాట్లపై నియంత్రణ సాధ్యమవుతుందని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డివి రామమూర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం పై అవగాహన

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఉద్యాన శాఖ లో పని చేస్తున్న మండల ఉద్యాన అధికారులకు, జిల్లా ఉద్యానశాఖ కార్యాలయ సిబ్బందికి, సమాచార హక్కు చట్టంపై మంగళవారం ఉద్యాన శాఖ కార్యాలయం లో అవగాహన కలిగించారు. జిల్లా ఉద్యాన అధికారి సిహెచ్ చంద్ర శేఖరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డివిజినల్ పౌర సంబంధాల అధికారి ఎస్.జానకమ్మ సమాచార హక్కుచట్టం ప్రాముఖ్యతను, పిఐఒ, ఎపిఐఒల బాధ్యతలను వివరించారు.

హోంమంత్రి వ్యక్తిగత సహాయకుడిగా చలామణి అవుతున్న వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి- కంటోన్మెంట్

జిల్లాలో రాష్ట్ర హోంశాఖామంత్రి వ్యక్తిగత సహాయకుడిగా చలామణి అవుతున్న నకిలీ వ్యక్తి అల్లూరి అరవింద్ (21)ను 1వ పట్టణ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఈనెల 21న ఒక వ్యక్తి జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చి, రిసెప్షనిస్టుగా విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబులు అరుణను కలిసి, తాను రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత వ్యక్తిగత సహాయకుడిగా పరిచయం చేసుకున్నారన్నారు.ఎస్‌పిని అత్యవసరంగా కలవాలని కోరారని, అందుకు, మహిళా కానిస్టేబులు అరుణ ప్రస్తుతం ఎస్‌పి పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రసల్ ఫిర్యాదులు చూస్తున్నారని, కొద్ది సమయం పడుతుందని తెలిపారు. గతంలో తాను ఇచ్చిన ఫిర్యాదుపై ఎటువంటి చర్యలు చేపట్టలేదని, తాను వెంటనే ఎస్‌పిని కలవాలని, లేకుంటే నీ అంతు తేలుస్తానని, ఉద్యోగం ఎలా చేస్తావో చూస్తానని, దౌర్జన్యం చేస్తూ, బెదిరింపులకు పాల్పడ్డారన్నారు. ఈ విషయమై మహిళా కానిస్టేబులు అరుణ 1వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితుడిని అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేపట్టారన్నారు. నిందితుడు తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లాకు చెందిన అల్లూరి అరవింద్‌గా గుర్తించామన్నారు. వెంటనే అరెస్టు చేసినట్లు తెలిపారు.

పెట్రోల్ బంకులు ఆకస్మిక తనిఖీ

కంటోన్మెంట్ : జిల్లా కేంద్రంలోని పెట్రోల్ బంక్ లను మంగళవారం వివిధ శాఖల అధికారులు తనిఖీ చేసారు. ట్యాంకుల్లో నిల్వ ఉంచిన పెట్రోల్, డీజిల్‌ను పరిశీలించారు. తనిఖీల్లో ఐఒసిఎల్ సేల్స్ ఆఫీసర్ పివి శివకుమార్, బిపిసిఎల్ సేల్స్ ఆఫీసర్ అన్విత, లీగల్ మెట్రాలజీ ఎసి రంగారెడ్డి, సిఎస్డిటిలు పాల్గొన్నారు.

త్వరలో టిడిపి అధ్యక్షుని మార్పు

రేసులో కెఎ నాయుడు, కంది చంద్రశేఖర్, కరణం, సువ్వాడ రవిశేఖర్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

త్వరలో టిడిపి జిల్లా అధ్యక్షుడు మార్పు ఉండ వచ్చునే చర్చ పార్టీ నాయకుల్లో వ్యక్తమౌతోంది. ఈనేపథ్యంలో కొందరు నేతలు ఆ పదవి రేసులో ఇప్పటికే ఉన్నట్టుగా కూడా వినికిడి. టిడిపి జిల్లా అధ్యక్షులుగా కిమిడి నాగార్జున సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఉన్నంతలో పార్టీని బాగానే నడిపారనే చర్చ పార్టీ నాయకుల్లో ఉంది. ముఖ్యంగా గత ప్రభుత్వ హయాంలో చీపురుపల్లి కేంద్రంగా ఆయన బలంగా నిలబడ్డారు. మరెక్కడా జరగనంతగా పార్టీ కార్యక్రమాలు నిర్వహించి, గత అధికార పార్టీ వైసిపిని ఢీకొనే విధంగా పనిచేశారనే ముద్రవేసుకున్నారు. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే సీటు ఆశించినప్పటికీ చివరి క్షణాల్లో చేజారింది. తొలుత కొంత అసంతృప్తి వ్యక్తం చేసినప్పటికీ, యువనేత లోకేష్ బుజ్జగింపుతో పార్టీ బాధ్యతల నిర్వహణ విషయంలో ఎక్కడా తగ్గకుండానే కొనసాగారు. ఈనేపథ్యంలో ఇటీవలే ఆయనకు డిసిసిబి ఛైర్మన్‌గా పదవి కట్టబెట్టిన సంగతి తెలిసిందే. ఆ బాధ్యతల రీత్యా నాగార్జునను జిల్లా అధ్యక్ష పదవి నుంచి తప్పించి, కొత్తవారికి ఇవ్వాలని అధిష్టానం భావిస్తోందట. ఈనేపథ్యంలో ఆశావహులంతా ఊహల్లో తేలుతున్నారు. ముఖ్యంగా గజపతినగరం నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కెఎ నాయుడు ఇప్పటికే ప్రయత్నం చేస్తున్నట్లు చర్చనడుస్తోంది. జిల్లాకు చెందిన మరో ముఖ్యనేత ఆశీస్సులతో అదే నియోజక వర్గానికి చెందిన కరణం శివరామ కృష్ణ కూడా దరఖాస్తు పెట్టుకున్నారట. సామాజికవర్గ ప్రాధ్యానత రీత్యా నెల్లిమర్ల నియోజకవర్గానికి చెందిన కంది చంద్రశేఖర్, సువ్వాడ రవిశేఖర్ కూడా పదవిరేసులో ఉన్నట్లు సమాచారం. వీరు కూడా పార్టీలో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్నారు.గత న్నికల సమయానికి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న కెఎ నాయుడుకు సీటు ఇవ్వలేదు. దీంతో ఆయన లోలోపల మదన పడినప్పటికీ, పార్టీ అధినేత చంద్రబాబు బొండపల్లి పర్యటనలో సముదాయించారు. పార్టీ కోసం పనిచేయాలని, అధికారంలోకి వచ్చాక తప్పక గుర్తింపు ఉంటుందని హామీ ఇచ్చారు. దీంతో, నాయుడు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. దీనికితోడు మిగిలినవారితో సరిపోల్చినప్పుడు జిల్లా రాజకీయాలపై నాయుడుకు కాస్త పట్టుకూడా ఉంది. ఈనేపథ్యంలో ఆయనకు ఈసారి అధ్యక్ష పదవి వరించవచ్చనే ఊహాగానాలు పార్టీలో వినిపిస్తున్నాయి. రవిశేఖర్ కూడా 30ఏళ్లగా టిడిపిలో కొనసాగుతున్నారు. పదవులు లేకపోయినా పార్టీని అంటిపెట్టుకుని ఉన్నారు. ఇదే గుర్తింపుతో గడిచిన ఎన్నికల్లో విశాఖ నార్త్ నియోజకవర్గ పరిశీలకునిగా కూడా రాష్ట్ర పార్టీ నియమించింది. కంది చంద్రశేఖర్ కూడా గత ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపి సీటు ఆశించారు. ఏదో ఒక పదవి వస్తుందని భావిస్తున్నారు. అయితే ప్రధానంగా కెఎ నాయుడు, కంది చంద్రశేఖర్, కరణం శివరామకృష్ణ ఎంపికపై ఐవిఆర్ఎస్ సర్వే చేస్తున్నట్లు తెలిసింది. సుదీర్ఘకాలం పాటు టిడిపిలో కొనసాగుతూ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న ఐవిపి రాజు కూడా జిల్లా అధ్యక్ష పదవి వస్తుందని ఆశిస్తున్నారు. అదిష్టానం ఎవరివైపు మొగ్గు చూపుతుందో వేచి చూడాల్సిందే.

డ్రాపౌట్లు లేని జిల్లాగా మార్చాలి

విద్యా ప్రమాణాలు పెరగాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న వారికి ప్రభుత్వం అనేక వసతులను కల్పిస్తుందని, అయినప్పటికీ పిల్లలు బడి మానివేయడం అనేది ఆందోళన కలిగిస్తున్న అంశమని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అన్నారు. టీచర్, స్టూడెంట్ అటెండెన్స్ శత శాతం ఉండాలని తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఎంఇఒలు, రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపాల్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 9 వేల మంది డ్రాపౌట్లు ఉన్నట్లు గుర్తించామని, ఒక్క 10వ తరగతిలోనే 850 మంది ఉన్నారని, బడి మానేసిన ప్రతి విద్యార్థి ఇంటికి హెడ్‌మాస్టర్ వెళ్లి మాట్లాడాలని, విద్యార్థి పరిస్థితిని తెలుసుకొని బడిలో చేర్పించాలని తెలిపారు. విద్యార్థి దశలో 10వ తరగతి అత్యంత ముఖ్యమని, 10లో ఫెయిల్ అయిన విద్యార్థి భవిష్యత్తు గందరగోళంగా ఉంటుందని ఆ పరిస్థితి రానీయకుండా చూడాలని తెలిపారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుడు విద్యార్థులతో వీలున్నంత ఎక్కువ సమయం గడపాలని, అప్పుడే విద్యార్థి మానసిక పరిస్థితి తెలుస్తుందని, వారికీ ఆత్మ స్థైర్యం పెరుగుతుందని అన్నారు. ఈ ఏడాది 10 ఫలితాలు మెరుగ్గా ఉండాలని తెలిపారు. ప్రాంతీయ సంయుక్త సంచాలకులు భాస్కర రావు మాట్లాడుతూ పిల్లలు అట్లాడు కున్నపుడు, అన్నం తిన్నప్పుడు కూడా ఉపాధ్యాయుడు దగ్గరగా ఉండాలని, అప్పుడే విద్యార్థికి నమ్మకం కలుగుతుందని అన్నారు. తరగతి లో వెనుకబడి ఉన్న వారి పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సబ్జెక్టు టీచర్స్ సెలవులో ఉన్నపుడు వెంటనే డిఇఒకు తెలియ జేయాలని తెలిపారు. డిఇఒ మాణిక్యం నాయుడు మాట్లాడుతూ షైనింగ్ స్టార్స్ పేరుతో ప్రోత్సాహకాలను అందజేయడం, పాఠశాలల రీ స్ట్రక్చర్, బుక్స్, కిట్స్ సరఫరా, ఎన్‌రోల్‌మెంట్ పెరగడం వంటి కార్యక్రమాల్లో విజయవంతం అయ్యాయమని తెలిపారు. ఈ సందర్భంగా 10 ఫలితాల్లో శత శాతం సాధించిన రెసిడెన్షియల్ పాఠశాలలు, జిల్లా పరిషత్, కెజిబివి పాఠశాలల హెడ్ మాస్టర్లకు, ప్రిన్సిపాల్స్‌కు సన్మానించారు. సమావేశంలో సమగ్ర శిక్ష పిఒ డాక్టర్ రామారావు, డిప్యూటీ డిఇఒలు, కెజిబివి, మోడల్ స్కూల్స్, హెచ్‌ఎంలు, ప్రిన్సిపాల్స్, ఎంఇఒలు, డైట్ ప్రిన్సిపాల్ రామకృష్ణ, పరీక్షల కో ఆర్డినేటర్ సన్యాసి రాజు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి

అర్హులందరికీ రుణాలు మంజూరు చేయాలి

ఎంఎల్ఎ అదితి విజయలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

అర్హత ఉన్న వారందరికీ రుణాలను మంజూరు చేసి, వారు ఆర్థికంగా ఎదిగేందుకు సహకరించాలని ఎంఎల్ఎ పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు కోరారు. విజయనగరం శాసనసభ నియోజకవర్గ బ్యాంకర్ల సమావేశం స్థానిక డిఆర్‌డిఎ సమావేశ మందిరంలో మంగళవారం జరిగింది. వివిధ ప్రభుత్వ రుణ పథకాలను లబ్ధి దారులకు చేరవేయడంలో ఎదురవుతున్న ఇబ్బందులు, వాటిని అధిగమిచడం పై చర్చించారు. లీడ్ బ్యాంకు ప్రబంధకుడు రమణ మూర్తి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అర్హత ఉన్నవారికి త్వరితగతిన రుణాలను అందజేయడమే కాకుండా, ఆ రుణాలను వారు సద్వినియోగం చేసుకొని, జీవనోపాదులు పెంచుకొనేవిధంగా కృషి చేయాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పిఎంఇజిపి, పిఎం సూర్యఘర్, పిఎం విశ్వకర్మ పథకాలకు మరింత పెద్ద ఎత్తున ప్రచారం కల్పించి, అర్హులందరూ పొందేవిధంగా చూడాలని కోరారు. ఎస్‌బిఐ విజయనగరం శాఖ ప్రబంధకుడు రవి కుమార్ సమన్వయ కర్తగా వ్యవహరించిన ఈ సమావేశంలో వ్యవసాయశాఖ జెడి విటి రామారావు, పశు సంవర్ధకశాఖ జెడి డాక్టర్ వైవి రమణ, మెప్మా పీడీ జివి చిట్టిరాజు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో పార్కింగ్ ఛార్జీలు తగ్గించాలి

వాల్తేరు డిఆర్‌ఎంకు ఎమ్మెల్యే అదితి లేఖ

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఇటీవల విజయనగరం రైల్వే స్టేషన్‌లో భారీగా పెంచిన పార్కింగ్ ఛార్జీలపై ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు స్పందించారు. ఈ మేరకు వాల్తేరు రైల్వే డిఆర్ఎం లలిత్‌బోరాకు లేఖ రాశారు. ఇటీవల పార్కింగ్ ఛార్జీలు విపరీతంగా పెంచేశారని, తాము ప్రయాణించే ట్రైన్ టికెట్ ధరల కంటే ఈ పార్కింగ్ ఛార్జీలే అధికంగా ఉన్నాయని ఆందోళన చెందిన ప్రయాణికులు ఇటీవల ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈనేపథ్యంలో స్పందించిన ఎమ్మెల్యే డిఆర్‌ఎంకు లేఖ రాశారు. ఈ ఛార్జీల పెంపు వల్ల ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఛార్జీలు తగ్గించాలని కోరారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



వినతినిస్తున్న సిఐటియు నాయకులు సురేష్, లక్ష్మి

మేజర్ పంచాయ తీల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా పంచాయతీరాజ్ కార్యాలయం ఎఒ పద్మావతికి సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేష్ మాట్లాడుతూ జిల్లాలో 11 మేజర్ పంచాయతీల్లో కార్మికులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని తెలిపారు. కనీస వేతన చట్టం ప్రకారం రూ. 26 వేలు ఇవ్వాలని, పిఎఫ్, ఇఎస్ఐ ,ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, ప్రతినెల పదో తేదీ లోపు జీతాలు వారి అకౌంట్లో వెయ్యాలని, టెండర్ విధానం రద్దు చేయాలని, పనిముట్లు, నూనె, సబ్బులు, యూనిఫాం ఇవ్వాలని, కార్మికుడు ఎకౌంట్లో జీతాలు వేయాలని, ఉద్యోగ భద్రత కల్పించి, రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.లక్ష్మి, పంచాయతీ యూనియన్ నాయకులు పి.కోటేశ్వరరావు, బంగారు పైడ్రాజు, బి.సంతోష్, ఎస్.అప్పన్న, కె.భవాని, కె.శ్యామల, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని రామస్వామి పేట గ్రామంలో మెంటర్ ఎస్.కె దర్గా మదీనా మంగళవారం క్షేత్ర స్థాయిలో ప్రకృతి వ్యవసాయం పైన వ్యవసాయ శాఖ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. రీజనల్ టెక్నికల్ ఆఫీసర్ హేమసుందర్ అధ్యక్షతన జరిగిన శిక్షణలో కొత్తవలస డివిజన్ పరిధిలో ఉన్న ఐదు మండలాల వ్యవసాయ శాఖ సిబ్బంది, వివిఎఎ, విహెచ్ఎస్, ఎంపిఇఒలు పాల్గొన్నారు. ప్రకృతి వ్యవసాయం ఉద్దేశం, లక్ష్యాలు పైన వ్యవసాయ శాఖలో రాబోయే మార్పులు పైన రైతు సేవా కేంద్రాలు భవిష్యత్తులో ఏ విధంగా పనిచేయాలి అనే అంశాల పైన పూర్తి స్థాయిలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కొత్తవలస ఎడిఎ భానులత తెలిపారు. మూడు రోజులు పాటు సిబ్బందికి బీజామృతం, ఘనజీవామృతం, వేపుస్త్ర ద్రావణం, ద్రవ జీవామృతం, శిక్షణ ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఐదు మండలాల వ్యవసాయాధికారులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూ రికార్డుల ప్రక్షాళనకే భూ రీసర్వే

ప్రజాశక్తి - రేగిడి

గ్రామాల్లో భూ రీసర్వేతోనే రికార్డులు ప్రక్షాళన చేపడుతున్నట్లు తహశీల్దార్ ఐ.కృష్ణలత, ఆర్ఎస్‌డిటి ఈశ్వరరావు అన్నారు. చిన్న శిర్లాం గ్రామంలో సర్పంచ్ బంకాల ఉమాపతి నాయుడు అధ్యక్షతన మంగళవారం భూ రీసర్వే పై గ్రామ సభలు నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఈ సర్వేకు ప్రజలు సహకరించాలన్నారు. భూ రీసర్వే ప్రాప్తికి నూతన పుస్తకాలు అందజేసేందుకు కృషి చేస్తామన్నారు. నిష్పక్షపాతంగా భూసర్వే చేసి కచ్చితంగా రికార్డులు అందజేస్తామన్నారు. రైతులు ఎటువంటి అపోహలు పడరాదన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి అచ్చెంనాయుడు, జగన్మోహన్‌రావు, విఆర్ఒలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీ పరిధిలోని థామస్ పేటలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 15వ వార్డు కౌన్సిలర్ కళ్యాణం సత్యనారాయణ, థామస్‌పేట యూత్ ఆధ్వర్యంలో స్థానిక స్టేజి వీధి వద్ద ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. విజయనగరానికి చెందిన శ్రీ వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఈ శిబిరంలో రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేపట్టారు. కేట్రాక్ట్, టిబిజియం వంటి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన రోగులకు పుష్పగిరి కంటి ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్ చేస్తారని కౌన్సిలర్ సత్యనారాయణ తెలిపారు. ఉచిత రవాణా సౌకర్యంతో పాటు ఉచిత భోజన వసతి కూడా కల్పిస్తారన్నారు. సుమారు 200 మంది ఈ ఉచిత వైద్య శిబిరాన్ని వినియోగం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

గిరిజన ఆశ్రమ పాఠశాలకు ఫ్యాన్లు వితరణ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని సాయిబాబా గుడి వెనుక గల ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సబ్ డిస్ట్రిక్ట్ బ్రాంచ్ ఎస్‌కోట ముఖ్య నేతలు ఫ్యాన్లు, బ్లాక్ బోర్డులు స్కూలు కిటికీలకు కావలసిన దోమల మెష్‌లను బ్రాంచ్ చైర్మన్ డాక్టర్ పి.లలిత్ కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లలిత కుమారి మాట్లాడుతూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా ఈ పాఠశాలకి కావలసిన వస్తువులు అందించడం సంతోషమని తన వంతుగా విద్యార్థులకి కావలసిన నోటు పుస్తకాలు సత్యసాయి ట్రస్ట్ ద్వారా అందిస్తానని అన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ లో బ్లడ్ మేనేజ్మెంట్ టీచర్లు ప్రజా ప్రతినిధులు చేరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ మాస్టర్ టి కిశోర్, జోగారావు మాస్టర్, డిస్ట్రిక్ట్ ఎంసీ మెంబర్ డి.సూర్యారావు, కోశాధికారి శ్రీనాథ్ వెంకన్న బాబు, వైస్ చైర్మన్ ఆకుల మల్లేశ్వరరావు, టిడిపి మండల అధ్యక్షులు జీఎస్ నాయుడు, మాజీ మండల అధ్యక్షులు రెడ్డి వెంకన్న, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెల్లివలస పిహెచ్‌సిని సందర్శించిన డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని రెల్లివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిఎం అండ్ హెచ్ఒ జీవనరాణి మంగళవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. పిహెచ్‌సి పనితీరుపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ హెచ్ ఆర్ అప్‌లోడింగ్, ల్యాబ్ రికార్డులు ధ్రువీకరణ, సిబ్బంది హాజరు, ఐఎల్ఆర్ అండ్ వ్యాక్సిన్ స్టాకును పరిశీలించారు. వెబ్ పోర్టల్‌లో అన్ని పారామితులను అప్‌లోడ్ చేయాలని, సంస్థ డెలివరీలను ప్రోత్సహించాలని వైద్యాధికారి డాక్టర్ రాజకుమార్‌కు సూచించారు.

డీలర్లు సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి - గంట్యాడ

చౌక ధరల దుకాణాల డీలర్లు రేషన్ అందించడంలో సమయపాలన పాటించాలని డిప్యూటీ తహశీల్దార్ మూర్తి అన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు సరుకులు పంపిణీ చేయాలన్నారు. డీలర్లు బియ్యాన్ని బయటికి అమ్మినా, తరలించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిరంతరం సరుకులను అందించాలన్నారు. దుకాణాల దగ్గరకు రాలేని వృద్ధులకు, వికలాంగులకు నేరుగా ఇంటికి వెళ్లి బియ్యాన్ని అందించాలని అన్నారు.

26న మెగా జాబ్ ఫెయిర్

ప్రజాశక్తి - డెంకాడ (భోగాపురం)

ఈ నెల 26న భోగాపురం మండలంలోని ముంజేరు మిరాకిల్ ఎడ్యుకేషనల్ సొసైటీ కళాశాల ప్రాంగణంలో మెగా జాబ్ ఫెయిర్ నిర్వహిస్తామని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. ముంజేరు పార్టీ కార్యాలయంలో మంగళవారం జాబ్‌మేళాకు సంబంధించిన పాంప్లెట్‌ను ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాబ్ ఫెయిర్‌లో 35 ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఈ వేదిక ద్వారా 2, 3 వేల మంది నిరుద్యోగ యువతకు నేరుగా ఉద్యోగ అవకాశాలు అందిస్తామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులతో పాటు నైపుణ్యాలు కలిగిన యువత ఉపయోగించుకోవాలని ఆమె కోరారు. జిల్లాలోని ప్రతి నిరుద్యోగ యువకుడు ముందస్తుగా రిజిస్ట్రేషన్ చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి శాఖ అధికారులు భాస్కర్, ప్రశాంత్, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను సన్మానించిన కలెక్టర్

ప్రజాశక్తి - గంట్యాడ

మండలంలోని లక్కిదాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న ఎంజి విజయలక్ష్మిని మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సన్మానించారు. 2024 -25వ సంవత్సరంలో 10వ తరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించినందుకు విద్యాశాఖ సిబ్బందికి, ఉపాధ్యాయులకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఇఒ, డిప్యూటీ డిఇఒ, ఆర్‌జెడి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మిథున్ రెడ్డి అరెస్టు అన్యాయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వైసిపి ఎంపి మిథున్‌రెడ్డిని లేని కుంభకోణంలో చూపించి అక్రమ అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు, ఫ్లోర్‌లీడర్ ఎస్‌వివి రాజేష్ అన్నారు. మంగళవారం కోలగట్ల నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ లేని అవినీతిని చూపించి,మద్యం కుంభకోణం పేరుతో అరెస్టు చేయడం అన్యాయమన్నారు. మద్యం పాలసీ లేకుండా అక్రమాలు చేస్తున్న ప్రభుత్వం మద్యం వ్యాపారం జరుగుతుందన్నారు.లేని కుంభకోణంలో అక్రమ అరెస్టులు చేయడం సరికాదన్నారు. సమావేశంలో వైసిపి కార్పొరేటర్లు తవిటిరాజు, పిన్నింటి శ్రీనివాసరావు, రంగా, ఆనంద్, బంగారునాయుడు, కాళ్ల సూరిబాబు, పిన్నింటి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

కంటోన్మెంట్: విజయనగరం మండలం జమ్మునారాయణపురం కోమటి చెరువులో గుర్తు తెలియని మహిళ మృతదేహం మంగళవారం మధ్యాహ్నం లభ్యమైంది. స్థానికులు చూసి విజయనగరం రూరల్ పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. మృతురాలి వయసు 40 నుండి 50 సంవత్సరాలు ఉంటుందని ఎస్ఐ తెలిపారు. వివరాలు తెలిసిన విజయనగరం రూరల్ పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ వి.అశోక్ కుమార్ తెలిపారు.

నేడు బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ

వేపాడ: మండల కేంద్రంలోని వల్లంపూడి, వేపాడ గ్రామంలో బుధవారం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వైసిపి మండల అధ్యక్షులు ఎం. జగ్గబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ఇంటింటికీ తిరిగి చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు వివరిస్తామన్నారు

కొత్తవి మంజూరు కావు.. పాతవాటికి బిల్లులు రావు

◆ హౌసింగ్ సంస్థ పనితీరుపై ప్రజల్లో అసంతృప్తి ◆ దరఖాస్తులు స్వీకరించినా ముందుకు కదలని ఫైలు ◆ఏడాదిగా తప్పని ఎదురుచూపులు

ప్రజాశక్తి- వేపాడ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నూతనంగా ఇంటి నిర్మాణాలు చేసుకునే వారు దరఖాస్తులు పెట్టుకోవాలని గ్రామాల్లో పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. దీంతో పేదలంతా తమ సొంత స్థలాల్లో ఇంటి నిర్మాణాలు చేపట్టుకునేందుకు దరఖాస్తులు పెట్టుకున్నారు. అయితే దరఖాస్తులు స్వీకరించిన ప్రభుత్వం ఆ ఫైలును ముందుకు కదపలేదు. ఫలితంగా దరఖాస్తులన్నీ హౌసింగ్ శాఖలోనే మూలుగుతున్నాయి. పోని గతంలో ఇంటి నిర్మాణం చేసి మధ్యలో నిలిచిపోయిన వాటికి బిల్లులు ఇస్తామన్నారు. అవీ పూర్తి స్థాయిలో అందక పోవడంతో మళ్లీ ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా

సింగరాయిలో మధ్యలో నిలిచిపోయిన ఇంటి నిర్మాణం

ఇంటినిర్మాణాలు మూలుగుతున్నాయి.

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మండలంలో 564 మంది తమకు ఇంటి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని దరఖాస్తు పెట్టుకున్నారు. వాటిమాట పక్కన పెడితే వైసిపి ప్రభుత్వం నిర్మించిన వాటికి కూడా పూర్తి స్థాయిలో లబ్ధిదారులకు బిల్లులు చెల్లించలేదు. ఇంతలో ఆ ప్రభుత్వం మారి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటినప్పటికీ గత ప్రభుత్వంలో మంజూరైన గృహాలకు గాని, లబ్ధిదారులు సొంత స్థలంలో నూతనంగా గృహం నిర్మించుకుంటామంటే అటువంటి వారికి గానీ బిల్లులు చెల్లిస్తామని నమ్మబలికి కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. దీంతో నూతనంగా ఇంటి నిర్మాణానికి చేసుకున్న 564 ధరఖాస్తు కార్యాలయానికే పరిమితమయ్యాయి. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బిల్లులు మంజూరు చేస్తోందన్న నమ్మకంతో ఆ పార్టీకి చెందిన కార్యకర్తలే కొంత మంది అప్పులు చేసి పునాదులు కూడా తీసేశారు. ఇప్పుడు ఏడాది కావస్తున్నా కొత్త ఇంటి నిర్మాణానికి బిల్లులు మంజూరు ప్రక్రియ ముందుకు కదలకపోవడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. పైగా కొత్త ఇంటి నిర్మాణాలకు మే నెలలో అనుమతులు వస్తాయని ఒకసారి, జూన్ అని ఇంకోసారి ఇప్పుడేమో ఆగస్టులో వస్తాయని దాటవేస్తున్నారే తప్ప లబ్ధిదారులకు భరోసా ఇవ్వలేకపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నూతనంగా ఇంటి నిర్మాణానికి ముందుకొచ్చిన వారితో పాటు గత ప్రభుత్వంలో ప్రారంభించి నిర్మాణాం పూర్తి కాని వారికి కూడా బిల్లులు మంజూరు చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

బిల్లు మంజూరు కాక వేపాడలో మధ్యలో నిలిచిపోయిన ఇల్లు

దరఖాస్తులు చేసుకోవాలి

ఇంత వరకూ ప్రభుత్వ పరంగా గృహాలు మంజూరు కాని వారు ఎవరైనా ఉంటే అటువంటి వారు ఆయా గ్రామ సచివాలయాలలో నూతన ఇంటి నిర్మాణానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఇప్పటికై మండలం మొత్తం మీద 564 మంది గృహాలను మంజూరు చేయాలని దరఖాస్తులు పెట్టుకున్నారు. రెవెన్యూ అధికారులు ఎన్ఒసి ఇస్తే తప్ప ఏ ఒక్క లబ్ధిదారునికి బిల్లు చెల్లించే అవకాశం లేదు. పైగా ప్రభుత్వం నుంచి అనుమతుల రాగానే పనులు ప్రారంభించాల్సి ఉంటుంది.

గంగాధర్, గృహ నిర్మాణ సంస్థ ఎఇ, వేపాడ

ఏడాదిలోనే ఎనలేని అభివృద్ధి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ప్రభుత్వం ఏడాది పాలనలోనే ఎనలేని అభివృద్ధి చేసిందని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని పోతనాపల్లి గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాల గురించి ఎమ్మెల్యే వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని సంబంధిత అధికారులకు పరిష్కరించాలని ఆదేశాలిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాణి, టిడిపి మండల అధ్యక్షులు జీఎస్ నాయుడు, రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న, క్లస్టర్ కో–ఇంచార్జ్ కూనిరెడ్డి రాము, యూనిట్ ఇంచార్జ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే కోళ్ల

రోడ్డు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు వినతి

బొబ్బిలి రూరల్ : మండలంలోని దిబ్బగుడివలస జంక్షన్ నుండి రాజుపేటకు వెళ్లే రహదారికి నిధులు మంజూరు చెయ్యాలని సుపరిపాలన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బేబినాయనకు గ్రామానికి చెందిన బోను రవి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దిబ్బగుడివలస నుంచి రాజుపేటకి వెళ్లే రహదారి తీవ్ర ఇబ్బంది కరమైన పరిస్థితిలో ఉందన్నారు. ఈ రహదారి గుండా రాజుపేట, సీతయ్యపేట, గుమ్మడివరం ప్రజలు నిత్యం రాకపోకలు చేస్తారన్నారు. వర్షం పడితే రోడ్డుమీద ప్రయాణించడానికి చాలా భయంగా ఉంది అన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఆ రోడ్డుకి ఇంతవరకు మోక్షం రాలేదన్నారు. త్వరగా రోడ్డు ఏర్పాటు చేసి ప్రజల సంక్షేమానికి పెద్ద పీట వేయాలని కోరారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం బస్సుని ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్యే బేబినాయన మాట్లాడుతూ ఈ రహదారికి నిధులు మంజూరు అయ్యాయని త్వరలోనే పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న కొందరిని పరామర్శించి వారికి ఎలాంటి సహాయం కావాలన్నా తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి అల్లాడ భాస్కరరావు, టిడిపి మండల అధ్యక్షులు వాసిరెడ్డి సత్యనారాయణ, ఎంపిటిసి వెన్నెల నాగరాజు, గోపాలరాయుడుపేట ఛానల్ కమిటీ చైర్మన్ నాగిరెడ్డి రామారావు, అల్లు కిషోర్, క్లస్టర్ ఇంచార్జులు, యూనిట్ ఇంచార్జులు, బూత్ ఇంచార్జులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత గురించి వివరిస్తున్న బ్యాంకు మేనేజర్లు

ఆర్థిక అక్షరాస్యత అందరికీ ఉపయోగం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యత పట్ల అవగాహన కలిగి ఉండాలని ఆర్థిక అక్షరాస్యత గురించి తెలుసుకుని చుట్టు పక్కల వాళ్ళకి తెలియజేయాలని పలువురు బ్యాంకర్లు తెలిపారు. సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్ఫర్మేషన్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నెల్లిమర్ల సికెఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత, సైబర్ నేరాల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భారతీయ స్టేట్ బ్యాంకు చీఫ్ మేనేజర్ సత్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు మేనేజర్ శ్రవణ్, డిసిసిబి బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ మూర్తినాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు మేనేజర్ శ్రవణ్ మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో ఇలాంటి ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం శుభ పరిణామం అని చెప్పారు.

శాంతి భద్రతల రక్షణకు అవుట్ పోస్ట్ : ఎస్‌పి

ప్రజాశక్తి- గంట్యాడ

శాంతి భద్రతలను రక్షించి పోలీసు శాఖను ప్రజలకు మరింత చేరువు చేయడానికి ఔట్ పోస్ట్ ఏర్పాటు చేశామని జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ అన్నారు. తాటిపూడిలో మంగళవారం అవుట్ పోస్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ కల్పించడంతో పాటు ప్రజలకు రక్షణ కల్పించడానికి అవుట్ పోస్ట్ ఏర్పాటు చేశామన్నారు. తాటిపూడి రిజర్వాయర్‌ను చూడడానికి వచ్చిన టూరిస్టులు సంఖ్య పెరగడంతో ఎటువంటి ప్రమాదాలూ జరగకుండా తిరిగి ఇంటికి పంపించడానికి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా నియంత్రించడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. టూరిస్టులు రిజర్వాయర్‌లోనికి బోట్ షికారు చేయడానికి వెళ్లే ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బోటులు పూర్తిస్థాయి సామర్థ్యంతో పని చేయడం, ప్రమాదాల నియంత్రణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం వంటి విధులను అవుట్ పోస్ట్ పోలీసులు నిర్వహిస్తారని అన్నారు. అవుట్ పోస్టులో హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ విధులు నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటారని అన్నారు. మాదక ద్రవ్యాలు వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు, యువతకు, ప్రజలకు ఎప్పటికప్పుడు వివరిస్తున్నామన్నారు. సైబర్ మోసాలు, మహిళల భద్రత, రహదారి భద్రత పట్ల అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి సౌమ్యలత, డిఎస్‌పి ఎం.శ్రీనివాసరావు, ఎస్‌బి సిఐ ఏవి లీలారావు, విజయనగరం రూరల్ సిఐ బి లక్ష్మణ్, గంట్యాడ ఎస్ఐ సాయి కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

గంట్యాడ: అవుట్ పోస్టును ప్రారంభిస్తున్నఎస్‌పి

'శౌర్య' రహదారి, మహిళల భద్రతపై అవగాహన

కంటోన్మెంట్ : నగరంలోని ముడిదాం గ్రామం వద్ద గల ఇనిస్పైరో స్కూలులో విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 'శౌర్య' పేరుతో సైబరు, రహదారి, మహిళల భద్రత, మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలపట్ల అవగాహన కార్యక్రమం మంగళ వారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్‌పి వకుల్ జిందాల్ మాట్లాడుతూ యువత చిన్న వయస్సులోనే మాదక ద్రవ్యాలకు అలవాటుపడి, జీవితాలను నాశనం చేసుకుంటున్నా రన్నారు. గంజాయి అక్రమ రవాణను నియంత్రించేందుకు ప్రత్యేక కార్యచరణ రూపొందించి, పెద్ద ఎత్తున గంజాయిని సీజ్ చేయడంతోపాటు, అందుకు కారకులైన నిందితులను అరెస్టు చేసామన్నారు. సైబరు నేరాలు పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. మహిళల భద్రతకు పోలీసుశాఖ శక్తి యాప్‌ను అందుబాటులోకి తీసుకు వచ్చిందన్నారు. ప్రతి ఒక్కరూ తమ మొబైల్స్ తప్పనిసరిగా శక్తి యాప్ను డౌన్‌లోడు చేసుకోవాలన్నారు. అనంతరం, రోటరీ క్లబ్ ప్రత్యేకంగా రూపొందించిన శౌర్యవాల్ పోస్టరును ఎస్‌పి ఆవిష్కరించారు. కార్యక్రమంలో రోటరీ చైర్మన్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, స్కూలు డైరెక్టరు రవి కె.మండ, ఎస్‌బి సిఐ ఎ.వి.లీలారావు, రూరల్ సిఐ బి.లక్ష్మణరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాబువి మోసపూరిత హామీలు

ప్రజాశక్తి -పూసపాటిరేగ

మోసపూరిత హామీలతో గెద్దనెక్కి ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం గురించి ప్రజలందరూ తెలుసుకోవాలని నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, విజయనగరం మాజీ ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కనిమెల్ల, కనిమెట్ట, కందివలస, చింతపల్లి, చౌడువాడ, అల్లాడి పాలెం, గోవిందపురం గ్రామాల్లో వారు ఇంటింటికీ తిరిగి చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించారు. మోసపూరిత హామీలు ఇవ్వటంలో కూటమి ప్రభుత్వానికి వెన్నతో పెట్టిన విద్య అని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు, ఎమ్‌పిపి ప్రతినిధి మహంతి శ్రీను, జిల్లా పార్టీ బిసి అధ్యక్షులు మహంతి జనార్దన్, నెల్లిమర్ల జెడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు, వైస్ ఎమ్‌పిపిలు చంటి రాజు, అల్లాడ రమేష్, బర్రి చిన్నప్పన్న, ఎస్‌సిసెల్ అధికారి ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, పాల్గొన్నారు.

గంట్యాడ: రాష్ట్ర ప్రజలను బాబు తన మోసపూరిత హామీలతో మోసం చేశారని జెడ్‌పిటిసి వర్రి నరసింహమూర్తి అన్నారు. మంగళవారం జగ్గాపురంలో బాబు ష్యూరిటీ బాబు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు జాగరపు అప్పారావు, నాయకులు పీరుబండి జైహింద్ కుమార్, నందాం సర్పంచ్ సత్యనారాయణ, పాల్గొన్నారు.

పూసపాటిరేగ: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ

నిరుద్యోగులకు భృతి ఏదీ ?

విజయనగరం టౌన్ : కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు భృతి ఇస్తామని, 50ఏళ్ల దాటితే పెన్షన్ ఇస్తామని చెప్పి మోసం చేసిందని మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మంగళ వారం నగరంలో గడపగడపకు వెళ్లి చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించారు. కూటమి ప్రభుత్వంలో సంవత్సర రెండు నెలల కాలంలో అందుకున్నటువంటి పథకాలను అడిగి తెలుసుకున్నారు. 45ఏళ్లు దాటిన వారికి పెన్షన్, నిరుద్యోగ యువతకు ఉద్యోగం, సూపర్ సిక్స్ పథకాలు ఇంకా అమలు చేయలేదని, కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేసిన మీరే ప్రశ్నించాలని, వైసిపి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మోకాళ్లపై నిల్చొని జిందాల్ బాధితుల నిరసన

ప్రజాశక్తి- శృంగవరపుకోట

భూములు కోల్పోయిన తమకు న్యాయం చేయాలంటూ జిందాల్ బాధితులు మండలంలోని బొడ్డవరలో మంగళవారం మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ నిరసనలో సిపిఎం నాయకులు చల్లా జగన్ పాల్గొని మాట్లాడుతూ నెల రోజులుగా నిర్వాసితులందరూ శాంతియుతంగా ఆందోళన నిర్వహిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. జిందాల్‌కు భూములు ఇచ్చి కూలీలుగా మారిన నిర్వాసితులందరూ తమ న్యాయమైన డిమాండ్లతో రోడ్డు మీదకి వస్తే పోలీసులు అనుమతులు ఇవ్వకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కంపెనీ కడితే ఉద్యోగం వస్తుందని, అందులో వాటా ఉంటుందని ఆశపడి భూములు ఇస్తే నిర్వాసితులందరినీ నిరాశ్రయులను చేసి జిందాల్ కంపెనీ ఎంఎస్ఎంఎల్ పేరుతో రియల్ ఎస్టేట్‌కు సిద్ధపడుతుంటే ప్రజల పక్షాన ఉండవలసిన ప్రజా ప్రతినిధులు గాని ప్రభుత్వం గాని కలుగజేసుకోపోవడం అన్యాయం అన్నారు. నిర్వాసితులకు న్యాయం జరిగే వరకూ పోరాటం కొనసాగిస్తామన్నారు.

మోకాళ్లపై నిరసన తెలుపుతున్న బాధితులు

వెంగళరాయ సాగర్ కాలువ సందర్శన

ప్రజాశక్తి- బొబ్బిలి

మండలంలోని సిహెచ్ బొడ్డవలస గ్రామంలో గల వెంగళరాయసాగర్ కాలువను రైతులతో కలిసి ఎమ్మెల్యే బేబినాయన మంగళవారం సందర్శించారు. సాగర్ కాలువలో కలుపు మొక్కల కారణంగా దిగువ పొలాలకు సాగునీటి సరఫరా సక్రమంగా జరడం లేదని తక్షణమే వాటిని తొలగించి పంట పొలాలకు సాగునీరు అందేలా చూడాలని గోపాలరాయుడుపేట ఛానల్ కమిటీ చైర్మన్ నాగిరెడ్డి రామారావు, పాత బొబ్బిలి ఛానల్ కమిటీ చైర్మన్ వాసిరెడ్డి సత్యనారాయణకి సూచించారు. వెంటనే స్పందిం చిన వారిద్దరూ పూడికలు, పిచ్చి మొక్కలను తొలగిం చడంతో కాలువలో ఎటువంటి అడ్డంకులూ లేనందున సాగునీటి సమస్య తగ్గినట్లు రైతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి అల్లాడ భాస్కరరావు, టిడిపి మండల అధ్యక్షులు వాసిరెడ్డి సత్యనారాయణ, ఎంపిటిసి వెన్నెల నాగరాజు రైతులు పాల్గొన్నారు.

కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

గ్రామాల్లో పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని పినతాడివాడ, పెద్ద తాడివాడ గ్రామాల్లో మంగళవారం ఎఒ టి. సంగీత ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి పంటను వేసిన రైతులు ఈ పంట నమోదు చేసుకోవాలన్నారు. యూరియా, డిఎపి ఎరువులు 4 నుండి 6 రోజుల లోపు రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉంటాయని తెలిపారు. వేరుశనగ, మొక్కజొన్న వేసిన రైతులు ఈ నెల 31వ తారీకు లోపు ఆసక్తిగల రైతులు ఇన్సూరెన్స్ బ్యాంకుల్లో గాని మీ సేవలో గాని చేసుకోవాలని తెలిపారు. వరి పంటకు ఎకరానికి 200 రూపాయలతో ఇన్సూరెన్స్ ఆగస్టు 15లోపు కట్టుకోవాలని రైతులకు తెలిపారు. అనంతరం పినతాడివాడ గ్రామంలో మినుములు మినీకిట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ఆధార్ లింకు తప్పనిసరి

రామభద్రపురం: అన్నదాత సుఖీభవ పథకానికి అర్హతలు కలిగి నిధులు విడుదల జాబితాల్లో పేర్లు లేని వారు వెంటనే రైతుసేవా కేంద్రాల్లో ఆధార్, ఎన్ పిసిఐ లింకు చేయించుకోవాలని స్థానిక ఎఒ అమరా శివ సూచించారు. మంగళవారం దుప్పలపూడి గ్రామంలో సిబ్బందితో కలిసి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి వివిధ వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. పత్తి పంటలో రసం పీల్చే పురుగులు నివారణకు తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. సూక్ష్మ పోషకాల ఉపయోగాలు తెలియజేశారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి ప్రకృతి ప్రసాదిత ఎరువుల వాడకం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది వెంకటరమణ, దీపిక, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రేగిడి: రైతులు పంటలకు బీమా చేయించుకుంటే అతివృష్టి, అనావృష్టిల కాలంలో పంటలకు నష్టపరిహారం అందజేస్తారని ఎఒ బి.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం సరసనాపల్లి, ఉణుకూరు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకంలో మొక్కజొన్నకు రూ.165, వరి పంటకు రూ.200లతో బీమా చేసుకోవాలని అన్నారు. ఈ పంటల బీమాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పంటలకు ఈ క్రాప్ బుకింగ్ తప్పనిసరి అని చెప్పారు. యూరియా, నెనో డిఎపి వాడకంతో పర్యావరణానికి ముప్పు లేకుండా ఉంటుందన్నారు. దిగుబడులు ఎక్కువ సాధించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ విజయలక్ష్మి, విఎఎ గాయత్రి, సిహెచ్ జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ విజయనగరం
1st Additional Civil Judge (Junior Division)
OS 194/2023

Karnataka Bank ....వాది
Mungi Venkata Ramana and another ....ప్రతివాదులు

Suit Summons

పై వాది తనకు రావలసిన బాకీ సొమ్మును రాబట్టుకునే నిమిత్తం పై నెంబరు, పై కోర్టులో దాఖలు చేసి యుంటిరి. సదరు పై నెంబరు గల దావా **తేదీ 29-10-2025** నాటికి ఉన్నది. కావున ఆ దినమున మీరు గానీ, మీ తరుపున వకీలు గారు గానీ **ఉదయం గం॥ 10-30 ని॥ల**కు పై కోర్టులో హాజరు అయి మీ ఆక్షేపణలు తెలపవలెను. లేనిచో మీ పరోక్షమందు కోర్టువారు విచారించి తగిన తీర్పు కోర్టువారు తెలుపుదురు.

P.V. Ganesh,
Advocate,
వాది తరుపు అడ్వకేట్,
విజయనగరం,
సెల్ : 9848438506

విజయనగరం
తే 22-07-2025 ది

IN THE HONOURABLE COURT OF JUNIOR CIVIL JUDGE AT KOTHAVALASA
O.S. 38/2025

Between:
Dogga Bhagyasri. ....Plaintiff
And:
Pediredla Appa Rao and others...Defendants
To:
D-1 Pederedla Appa Rao, S/o. Late Appanna, Pediredlapalem Village, H/o. Gram Panchayat, Rega, L. Kota Mandal, Vizianagaram District.
D-2 Pederedla Appanna, S/o. Late Appa Rao, Pediredlapalem Village, H/o. Gram Panchayat, Rega, L. Kota Mandal, Vizianagaram District.
D-3 Pederedla Dinish Kumar, S/o. Late Appanna, Pediredlapalem Village, H/o. Gram Panchayat, Rega, L. Kota Mandal, Vizianagaram District.
D-4 Pederedla Dileep Kumar, S/o. Late Appanna, Pediredlapalem Village, H/o. Gram Panchayat, Rega, L. Kota Mandal, Vizianagaram District.

NOTICE

Please take court notice/summons that the above suit is filed against all of you, who are proclaiming that you are going to tress-pass into the plaint schedule property situat-ed in Rega revenue village covered by Sy. No.s 145/6, 145/2, to grab the same. Due to non-service of court summons against all of you, this Hon'ble court is pleased to pass an order to serve the summons/notice under substitured service to all of you.

Therefore, herewith informing you that the above matter is posted to **Dt. 04.08.2025** for your appearance before the Hon'ble court of Junior Civil Judge at Kothavalasa at **10.30 A.M.,** if you fail to attend on that day, the matter will be heard and deceided ex-party.

(By court order)

G.S. Demudu,
Advocate,
Srungavarapukota